కోదాడ ఆసుపత్రిలో శరవేగంగా నూతన భవన నిర్మాణాలు 3

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

నేటి వెలుగు
తెలుగు దినపత్రిక
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాలలో నేటి వెలుగు తెలుగు దినపత్రికలో పని చేయుటకు
జిల్లా బ్యూరో | జిల్లా స్టాఫ్
డివిజన్ ఇంచార్జులు | మండల రిపోర్టర్లు
జూనియర్లకు సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు
95532 76552
ఎడిటర్
నవీన్ కుమార్ గౌడ్

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 171 | పేజీలు : 4 | అక్టోబర్ 4 ఆదివారం 2026 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 171 | PAGES:4 | SUNDAY OCTOBER 4 2026 | Rs. 4:00

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్: రేవంత్ రెడ్డి



- ఆన్‌లైన్‌లో పిల్లల భద్రతపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి

(మిగతా 2వ పేజీలో..)

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే: సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్

- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి
- పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య
- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్

(మిగతా 2వ పేజీలో..)



## రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా భారత్ కీలక అడుగు.. మోదీ ప్రతిపాదనపై ఉక్రెయిన్ ప్రశంసలు!

- చర్చలో నాలుగు కాల్పుల విరమణ ప్రతిపాదనలు
- భారత్ ప్రతిపాదన సమగ్రంగా ఉందన్న ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి
- ఇంధన రంగంపై దాడులు ఆపాలని కోరుతున్న ఉక్రెయిన్
- నల్ల సముద్రంలో సంధిపైనా జరుగుతున్న చర్చ
- మరోవైపు మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించిన పుతిన్



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు దౌత్య ప్రయత్నాలు మరోసారి ఊపందుకున్నాయి.

(మిగతా 2వ పేజీలో..)

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ కొనుగోలు చేసి ప్రయాణించిన తెలంగాణ మంత్రులు

- డే పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణించిన మంత్రులు
- బస్సులో బేగంపేట మెట్రోకు చేరుకున్న మంత్రులు
- జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణం



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పలువురు

(మిగతా 2వ పేజీలో..)

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్ రావు

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

(మిగతా 2వ పేజీలో..)

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన

(మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్: రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జ్‌మెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు

# రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు.అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

# మహిళా అభ్యర్థిపై స్టాలిన్ కామెంట్స్.. తీవ్రంగా స్పందించిన సీఎం విజయ్

- టీవీకే అభ్యర్థి సత్యభామపై డీఎంకే నేతల వ్యక్తిగత వ్యాఖ్యలు
- ఇది డీఎంకే విద్వేషపూరిత సంస్కృతికి నిదర్శనమన్న విజయ్
- సత్యభామకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించిన సీఎం
- అక్టోబర్ 6 ఉపఎన్నిక వేళ పెరుగుతున్న రాజకీయ వేడి



ధరాపురం ఉపఎన్నిక ప్రచారంలో టీవీకే అభ్యర్థి సత్యభామపై డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచార అంశాలను పక్కనపెట్టి, ఒక మహిళా అభ్యర్థి శరీర ఆకృతిని లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు.ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రచారంలో ఇలాంటి వ్యాఖ్యలకు తావులేదని సీఎం విజయ్ స్పష్టం చేశారు. మహిళలపై డీఎంకే నేతలు అసభ్యకరమైన, అవమానకరమైన భాషను ఉపయోగించడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఇది డీఎంకే పార్టీలో పాతుకుపోయిన విద్వేష, అసభ్యకరమైన సంస్కృతిని ప్రతిబింబిస్తోందని ఆయన ఆరోపించారు.ఈ విషయంలో తాను సత్యభామకు అండగా నిలుస్తున్నట్లు విజయ్ ప్రకటించారు. కేవలం ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా, తమిళనాడులోని మహిళలకు ఒక కొడుకుగా, అన్నగా, తమ్ముడిగా ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 6న జరగనున్న ఉపఎన్నిక నేపథ్యంలో టీవీకే, డీఎంకే మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రస్థాయికి చేరింది.

# నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే ఓట్ల తొలగింపు: వీహెచ్

నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఈ కుట్రను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని (ఈసీ) తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగింపజేస్తున్నారని వీహెచ్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేయాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జనాభా గణన జరుగుతున్నా, అందులో ఓబీసీల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు.ఈ అంశంపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని వీహెచ్ ప్రకటించారు. రేపు శంషాబాద్‌లో ఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి, 'ఓబీసీ గర్జన'ను ఢిల్లీ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడేందుకు ఇదే చివరి అవకాశమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్రం ఓబీసీ గణన చేపట్టేవరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ కొనుగోలు చేసి ప్రయాణించిన తెలంగాణ మంత్రులు





(మొదటి పేజీ తరువాయి)

మంత్రులతో కలిసి ఈరోజు మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో దీనిని ఆటోలు, క్యాబ్‌లకు అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు.శనివారం డే పాస్‌తో మంత్రులతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా తనతో పాటు ప్రయాణించిన మంత్రులకు, భట్టి విక్రమార్క కాంబో పాస్ కొనుగోలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, ప్రజా రవాణా వైపు ప్రయాణికులను ఆకర్షితులను చేయడం కోసం ఈ పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రస్తుతం వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని తెలిపారు. కాంబో పాస్‌పై ప్రయాణించిన మంత్రుల్లో వివేక్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.. చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు.షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా భారత్ కీలక అడుగు.. మోదీ ప్రతిపాదనపై ఉక్రెయిన్ ప్రశంసలు!

(మొదటి పేజీ తరువాయి)

ఈసారి భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ నుంచి కీలక స్పందన వచ్చింది. కాల్పుల విరమణ కోసం తమకు నాలుగు ప్రతిపాదనలు అందాయని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహా తెలిపారు. భారత్, అమెరికా, టర్కీ, ఈజిప్ట్ నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో.. భారత్ ప్రతిపాదన అత్యంత సమగ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

**భారత్ ప్రతిపాదనలో ఏముంది?**

భారత్ ప్రతిపాదన వివరాలను పూర్తిగా బయటపెట్టలేదు. అయితే ఉక్రెయిన్ ప్రకారం.. ఇంధన రంగంతో పాటు నల్ల సముద్రంలో కాల్పుల విరమణకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంధన కేంద్రాలు, ఓడరేవులపై దాడులు నిలిపివేయడం కూడా కీలక అంశంగా ఉంది. నల్ల సముద్రంలో నౌకాయానం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సజావుగా సాగేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.

**నాలుగు ప్రతిపాదనలు**

రష్యా-ఉక్రెయిన్ కాల్పుల విరమణ కోసం ప్రస్తుతం నాలుగు దౌత్య ప్రతిపాదనలు చర్చలో ఉన్నాయి. టర్కీ, ఈజిప్ట్ కలిసి నల్ల సముద్రంలో ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలు కల్పించే సంధిని ప్రతిపాదించాయి. అమెరికా ఇంధన మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడంపై దృష్టి పెట్టింది. భారత్ ప్రతిపాదన మాత్రం ఇంధన రంగం, నల్ల సముద్రం అంశాలను కలిపి చూస్తోంది.

**ఉక్రెయిన్ ఏం చెబుతోంది?**

కాల్పుల విరమణలో ఇంధన రంగం, నల్ల సముద్రం రెండూ కలిసే ఉండాలని ఉక్రెయిన్ కోరుతోంది. ఓడరేవులు సహా అన్ని ఇంధన మౌలిక వసతులపై దాడులు పూర్తిగా ఆగాలని సిబిహా స్పష్టం చేశారు. అదే సమయంలో యుద్ధ ప్రాంతం వెంట షరతులు లేని కాల్పుల విరమణను కూడా పరిశీలించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని తెలిపారు.

**మోదీపై పుతిన్ ప్రశంసలు**

ఈ పరిణామాల మధ్య రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ప్రధాని నరేంద్ర మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశాన్ని మోదీ పదేపదే ప్రస్తావిస్తున్నారని ఇటీవల ఓ కార్యక్రమంలో చెప్పారు. ఇరువైపులా ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. శాంతియుతంగా, త్వరగా సమస్య పరిష్కారం కావాలని మోదీ కోరుతున్నారని పుతిన్ అన్నారు.

**ముందున్న సవాలు ఏంటి?**

భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ సానుకూలంగా స్పందించినా.. కాల్పుల విరమణ అమలుకు రష్యా అంగీకారం కూడా కీలకం. ప్రస్తుతం నాలుగు ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయి. వాటిలో ఏది ఆచరణలోకి వస్తుందన్నది రాబోయే దౌత్య చర్చలపై ఆధారపడి ఉంటుంది.

# యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే: సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు.కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

# సరోగసీ దరఖాస్తులపై సమగ్ర పరిశీలన








**ఐదు దరఖాస్తుల్లో మూడింటికి ఆమోదం.. వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ**

**మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి:**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఏఆర్టి/సరోగసీ బోర్డు సమావేశం నిర్వహించారు. సరోగసీ ప్రక్రియలో వైద్యపరమైన అవసరం, చట్టబద్ధత, పారదర్శకత, నైతిక ప్రమాణాలు, భవిష్యత్ తల్లి--శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ దరఖాస్తులను బోర్డు సమగ్రంగా పరిశీలించింది. గర్భధారణకు సంబంధించిన వైద్యపరమైన సమస్యలు, గర్భస్థ శిశువును మోసే సామర్థ్యం, ఇతర ప్రత్యామ్నాయ చికిత్సల అవకాశాలు తదితర అంశాలపై నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణులు డాక్టర్ శివ కిరణ్ పాల్గొన్నారు. సరోగసీకి సంబంధించిన మొత్తం 5 దరఖాస్తులను బోర్డు పరిశీలించింది. సరోగసీ (నియంత్రణ) చట్టం, 2021లోని నిబంధనలు, నిర్దేశిత వైద్య ప్రమాణాలు, దరఖాస్తుదారుల అర్హతలు, సమర్పించిన సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం 3 దరఖాస్తులకు ఆమోదం తెలిపి వైద్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది. సరోగసీ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావులేకుండా చట్టపరమైన నిబంధనలను కఠినంగా అమలు చేయాలని బోర్డు స్పష్టం చేసింది. అర్హత కలిగిన దంపతులకు మాత్రమే పూర్తి వైద్యపరమైన, చట్టబద్ధమైన పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని డాక్టర్ కె. ఆనంద్ తెలిపారు. సరోగసీ ప్రక్రియలో తల్లి, శిశువు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తూ, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలిస్తున్నట్లు బోర్డు పేర్కొంది.

# నాలుగు పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ








- **వైద్య సేవలు, మందుల నిల్వ, సిబ్బంది హాజరుపై సమీక్ష**

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి జిల్లాలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరుట్ల, మాడ్గుల, ఇర్విన్, యాచారం పీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్ఓ అక్కడ అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపి , ఐ పి రిజిస్టర్లు, మందుల నిల్వలు, కోల్డ్ చైన్ నిర్వహణ, ల్యాబొరేటరీ సేవలు, సిబ్బంది హాజరు, పారిశుధ్య పరిస్థితులు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ఈ ఎన్సిడి , టిబి , ఇమ్యునైజేషన్ కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డా. స్వర్ణకుమారి సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్లు, సంబంధిత పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కోదాడ ఆసుపత్రిలో శరవేగంగా నూతన భవన నిర్మాణాలు







**రూ.26 కోట్లతో 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్**

**ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యమే ధ్యేయం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**కోదాడ, అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి:**

కోదాడ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం కోదాడలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా ఎస్పీ నరసింహలతో కలిసి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. రూ. 26 కోట్లతో 100 పడకలకు పెంపుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం 30 పడకలుగా ఉన్న కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 26 కోట్లు మంజూరు చేసిందని, నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని చెప్పారు. ఆసుపత్రి పునరుద్ధరణ పనులతో పాటు నూతనంగా నిర్మించిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ విభాగాలు పూర్తికావడంతో వాటిని వెంటనే ప్రజల వినియోగంలోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. అన్ని రకాల ఉచిత వైద్య సేవలుశనివారం నుంచే ఆసుపత్రిలో అన్ని రకాల ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినందున కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని వైద్యాధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, లక్ష్మారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెండెం వెంకటరమణ, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర వైద్యులు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివో ఏను కులం పేరుతో దూషించి దాడి చేసిన దుండగను కఠినంగా శిక్షించాలి.

**జిల్లా గౌరవాధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ.**



**నల్గొండ జిల్లా అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి:**

వివో ఏను కులం పేరుతో దూషించి దాడి చేసిన మాజీ సర్పంచ్ భర్త కుప్పల అమర్నాథ్ ను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఐకెపి వివోఏల సంఘం (సిఐటియు) నల్గొండ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల దుర్గయ్య పొడిచేటి సులోచన లు డిమాండ్ చేశారు. శనివారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పి కె మల్లేపల్లి లో ఐకెపి వివో ఏ గా పనిచేస్తున్న గనిపెల్లి మాధవి ని గ్రామ సభలో ప్రజలందరి సమక్షంలో కులం పేరుతో దూషించి దాడి చేసిన మాజీ సర్పంచ్ భర్త కుప్పల అమర్నాథ్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా సంఘ బంధం రుణాలు తీసుకొని కట్టమని అడిగినందుకు ఆమెను కొంతమందివేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. గత కొంతకాలంగా వివో ఏను టార్గెట్ గా చేసుకొని అన్యాయంగా4 అధికారులకు కంప్లైంట్ చేయడం ఆమె పేరు ఆన్లైన్లో నుంచి తొలగించడం జరిగిందని దానిపై కోర్టు తీర్పు వచ్చిన నియమాకం చేయకుండా గ్రామ సభలో న్యాయం చేయాలని మాట్లాడుతున్న వివో ఏ గనిపల్లి మాధవి దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఇప్పటికైనా మాధవికి న్యాయం చేయాలని వివో ఏ ల మీద జరుగుతున్న దాడులు వేధింపులు అరికట్టాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు ఎడవెల్లి పాపయ్య, ఆదిరాల లక్ష్మీ , జిల్లా సునీత, డి రజిత వెంకటమ్మ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

- **పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలి: టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల రవన్న మాదిగ**




**నల్గొండ అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి:**

తెలంగాణ మాదిగ సైన్యం (టీఎంఎస్) ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాదిగ సైన్యం సంస్థాగత నిర్మాణం, జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై చర్చించారు. ఈ సమావేశంలో టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల రవన్న మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు అందిస్తున్న కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ఆయన కోరారు. అలాగే విద్యార్థుల సంక్షేమానికి సంబంధించి హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అద్దె భవనాల స్థానంలో సొంత భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టీఎంఎస్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో టీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొడతాల నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి నక్కల సైదులు, జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు పెదమం శివ, గిరి, చందు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?

ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణునలు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

## ఆరోపణలు కాదు దమ్ముంటే నిరూపించండి

**పేదల పెన్నిధిపైనా పనికి రాని అభాండాలు**
**కాంట్రాక్టుల కోసం కాదు పేదల కన్నీళ్లు తుడిచేందుకు వచ్చాడు**
**వేవ్ లో గెలవలె ప్రజా ఆశీర్వాదంతో గెలిచాడు**
**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై ఆరోపణలపై పునరాలోచించాలి**
**యువజన కాంగ్రెస్ నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుల్ల యాకాంతం**

**వర్ధన్నపేట , అక్టోబర్ 03 నేటి వెలుగు ప్రతినిధి, :**




గత పాలకుల అక్రమాలు చూసి విసిగి వేసారిన ప్రజలు రానున్న కాలంలో ప్రజా పాలనలో ప్రజలతో మమేకమయ్యే నేత కావాలని గత ఎన్నికల్లో ఎన్ని కుట్రలు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా కేఆర్ నాగరాజుకు నియోజక వర్గ ప్రజలు పట్టం కట్టారని యువజన కాంగ్రెస్ నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుల్ల యాకాంతం అన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును నేరుగా ఏం చేయలేని కొందరు రాజకీయ పిరికి పందలు మీడియా ద్వారా చిల్లర ఆరోపణలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని యకాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా గత మూడు దశాబ్దాలుగా ప్రజా సేవలోనే ఉన్నప్పటికీ ప్రజలతో మరింత దగ్గరయ్యేందుకు ,వారికి సేవ చేసేందుకే ఎమ్మెల్యే నాగరాజు రాజకీయాల్లోకి వచ్చినట్లు యకాంతం తెలిపారు. ధనం,ధనం అని ప్రజలను మరిచి పాలించిన నేలన జనం జనం అనే నాయకుడు నిలబడి పాలన చేస్తుండడం తట్టుకోలేని కొందరు వ్యక్తులు కుట్రలు తమకు తెలుసునని వారికి కుట్రలకు తగిన గుణపాఠం సమయం వచ్చినపుడు ప్రజలే చెబుతారని అన్నారు. నిత్యం అక్రమాల వేదికగా నిలిచిన చోట అవినీతి పేరు లేకుండా చేస్తున్న ప్రజా పాలన ప్రత్యర్థుల భవిష్యత్తు ఆశలను తుదిపేస్తుండడం చూసి తట్టుకోలేక అవినీతి మరకలు అంటించాలని చూస్తే సహించేది లేదని యకాంతం హెచ్చరించారు.

వేవ్ లో గెలవలె ప్రజా ఆశీర్వాదంతో గెలిచాడు

ప్రజా పాలనలో సామాన్య ప్రజలకు సంక్షేమాన్ని అందించడం ఓర్చుకోలేని కొందరు దుర్మార్గులు వేవ్ లో గెలిచాడని పనికి రాని ఆరోపణలు చేస్తూ ప్రజా తీరుకు అపహాస్యం చేస్తున్నారని యకాంతం మండిపడ్డారు. వేవ్ లో గెలిచినట్లు చెబుతున్న వ్యక్తులు ప్రజల వేవ్ లో గెలిచాడని ఒప్పుకుంటే మంచిదని ప్రజలే ఓటు వేయకుండా గెలవలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మీరు గెలిస్తే గెలుపు వేరే వాళ్ళు గెలిస్తే వేవ్ అనడం మీ సంకుచిత మనసుకు సంకేతం అని యకాంతం అన్నారు. మీరు ఎన్ని కుట్రలు ఆరోపణలు చేసినా ప్రజాపాలనలో చేస్తున్న కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం,కేఆర్ నాగరాజు కలకాలం నిలిచిపోవడం పక్కా అని యకాంతం కొనియాడారు.

కటిక బీదరికం,కంచు పళ్ళాలు కాదు కమిట్మెంట్ ఉన్నవారికే పదవులు లక్ష్యం

కేఆర్ నాగరాజు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా వచ్చిన నాటి నుండి నియోజక వర్గంలో వచ్చిన పదవులు ,వాటికి కేటాయించిన వ్యక్తుల జీవితాలు తెలుసుకుంటే డబ్బుల ఆరోపణలు చేస్తున్న వ్యక్తులే తప్పు ఒప్పుకుంటారని యాకంతం దుయ్యబట్టారు. పార్టీని పట్టుకుని దశాబ్ద కాలంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా, పార్టీ మారాలని ఒత్తిళ్లు వచ్చినా పార్టీనే నమ్ముకుని ఉన్న వ్యక్తులకే పదవులు ఇచ్చి గౌరవించిన విషయాన్ని యకాంతం గుర్తు చేశారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని వ్యక్తులను రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషించేలా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చూపిస్తున్న శ్రద్ధ భవిష్యత్ తరాలకు, యువనేతలకు ఆశాజనకంగా మారిందని అన్నారు. ఆర్థికంగా ఉన్నవార లేని వార అని చూడకుండా పార్టీ భవిష్యత్తు పార్టీపై కమిట్మెంట్ ఉన్న నేతలను ఎంచుకొని కార్యకర్తల అభీష్టం మేరకే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నామినేటెడ్ ,పార్టీ పదవుల్లో అవకాశాలు ఇస్తున్నారని ఇప్పటికైనా ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో తెలుసుకుని నిజాలను ప్రజల ముందు ఉంచాలని ఇటీవల ఎమ్మెల్యేపై పనికి రాని ఆరోపణలు చేసిన ఓ మీడియా చానల్ కి యకాంతం సూచించారు.

## హెచ్చరిక బోర్డుల్లేవు.. వాహనదారులకు తిప్పలే!

**కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వస్తున్న వాహనదారులు**
**సొంత ఖర్చుతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్త**




**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి :**

రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ వాహనదారులను అప్రమత్తం చేసేందుకు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు జరుగుతున్న విషయం ముందుగానే తెలియకపోవడంతో వాహనాలు దారి మళ్లించాల్సిన పరిస్థితి నెలకొంది. సూరారం ఎక్స్‌రోడ్ నుంచి బౌరంపేట్, శంబీపూర్, ఐడీఏ బొల్లారం, మియాపూర్ వైపు వెళ్లే మార్గంలో సూరారం గ్రామంలోని విశ్వకర్మ కాలనీ ప్రాంతం దాటిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అయితే పనులు జరుగుతున్నట్లు సూచించే బోర్డులు, హెచ్చరికలు లేకపోవడంతో భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు సైతం సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత ఖర్చుతో సూచిక బోర్డులు

వాహనదారుల ఇబ్బందులను గమనించిన మాజీ లారీ యజమాని, నార్త్ రన్ సిటీ ఇసుక లారీల సంఘం మాజీ కార్యదర్శి, సామాజిక--పర్యావరణ కార్యకర్త రవీందర్ ముదిరాజ్ స్పందించారు. సంబంధిత అధికారుల కోసం ఎదురుచూడకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తన సొంత ఖర్చుతో మూడు సూచిక బ్యానర్లను ఏర్పాటు చేశారు. సూరారం చౌరస్తా నుంచి కట్టమైసమ్మ ఆలయం--బహదూర్‌పల్లి ఎక్స్‌రోడ్ చౌరస్తా వరకు వెళ్లి, అక్కడి నుంచి ఎడమవైపు తిరిగి బౌరంపేట్, ఐడీఏ బొల్లారం, బాచుపల్లి వైపు వెళ్లాలని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, బాబు, నవీన్‌కుమార్, కార్తీక్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు. స్థానికుల అభినందనలు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛందంగా ముందుకొచ్చి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంపై స్థానికులు, వాహనదారులు రవీందర్ ముదిరాజ్‌ను అభినందించారు. ప్రజా ప్రయోజనాల కోసం ఇలాంటి బాధ్యతాయుతమైన వ్యక్తులు ముందుకు రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం అవసరం





- **మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలి.. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని కాపాడాలి**
- **నల్గొండలో ఏఐ, సోషల్ మీడియాపై మీడియా అకాడమీ వర్క్‌షాప్**

**నల్గొండ, సెప్టెంబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి:**



ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం వ్యవస్థ అవసరమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సామాజిక మాధ్యమాలపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మెరుగైన జర్నలిజాన్ని ప్రజలకు అందించడంతో పాటు జర్నలిస్టుల వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏఐ, సోషల్ మీడియా ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నల్గొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టుల కోసం ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. అక్టోబర్ 12న నాగార్జునసాగర్‌లో పరిసర ప్రాంతాల జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జర్నలిజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని సక్రమంగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛ, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియా, వర్కింగ్ జర్నలిస్ట్ నిర్వచనాలు, జర్నలిస్టులు తెలుసుకోవాల్సిన ప్రధాన చట్టాలపై కూడా ఆయన అవగాహన కల్పించారు. వాస్తవాలను నిర్ధారించి వార్తలు ఇవ్వాలిశిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణతో ప్రతి పౌరుడు జర్నలిస్టులా వ్యవహరించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సమయంలో వార్తల్లో ఏది నిజం, ఏది అబద్ధమో ప్రజలకు స్పష్టంగా తెలిసేలా జర్నలిస్టులు వార్తలు అందించాలని సూచించారు. ఏఐ, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన జర్నలిస్టులకు ఎంతో అవసరమన్నారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రయోజనాలతో పాటు కొన్ని ప్రతికూల పరిణామాలు కూడా చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. ఏఐను సద్వినియోగం చేసేలా జర్నలిస్టులు కృషి చేయాలని, రిపోర్టర్లు నిరాధార వార్తలకు దూరంగా ఉండాలని సూచించారు. జర్నలిస్టులకు శిక్షణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్--ఇన్వెస్టిగేషన్ ఉడుముల సుధాకర్ రెడ్డి, సోషల్ మీడియాపై నరసింహస్వామి జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్‌డీ రహమాన్, పీఆర్వో శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి






**ప్రతి 30 కి.మీ.కు అంబులెన్స్, క్రేన్, హెల్పర్ అందుబాటులో ఉంచాలి**
**ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ, అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్, క్రేన్, హెల్పర్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, 26 మంది అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ నిరంతరం రోడ్డు భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. జంక్షన్ల వద్ద ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిర్యాలగూడ--నందిపాడు, చిట్యాల--నార్కట్‌పల్లి, కొండమల్లేపల్లి--ఆలగడప, డిండి--కొండపల్లి, నార్కట్‌పల్లి--వాడపల్లి మార్గాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దామరచర్ల రైల్వే బ్రిడ్జి వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని, కట్టంగూర్ పెట్రోల్ బంక్ పరిసరాల్లో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆక్రమణలు తొలగించాలి ఎన్‌హెచ్-65పై ఉన్న ఆక్రమణలను తొలగించాలని, రోడ్లపై వాహనాలను నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో రోడ్ల ఆక్రమణలను తొలగించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని బ్లాక్‌స్పాట్లను గుర్తించి తదుపరి సమావేశం నాటికి వాటి సంఖ్యను తగ్గించేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ట్రామా కేర్ హెల్త్ సెంటర్ల ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో 30 బ్లాక్‌స్పాట్లు

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలోకి లారీల రాకపోకలకు సమయపాలన విధించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎన్‌హెచ్-65 పరిధిలో ప్రమాదాలకు కారణమవుతున్న డాబాల వద్ద లారీలను నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత డాబా యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం 30 బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని, తదుపరి సమావేశం నాటికి వాటి సంఖ్యను తగ్గించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీవాణి, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎక్సైజ్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో రసవత్తరంగా నామినేషన్ల పర్వం!

**15 మేనేజింగ్ కమిటీ స్థానాలకు 33 మంది నామినేషన్లు**
**రెడ్‌క్రాస్ చరిత్రలో తొలిసారి భారీగా నామినేషన్లు**

**నల్గొండ జిల్లా అక్టోబర్ 3 నేటి వెలుగు ప్రతినిధి :**



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నల్గొండ బ్రాంచ్ (2026--2029) నూతన పాలకవర్గం ఎన్నికలకు నామినేషన్ల పర్వం శనివారం కొనసాగింది. ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో 15 మంది సభ్యులతో కూడిన మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఎన్నికల అధికారి టి. మమత ఆధ్వర్యంలో జిల్లా సహకార అధికారి కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. మొత్తం 33 మంది సభ్యులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్యానెల్ నుంచి 16 మంది నామినేషన్లు దాఖలు చేయగా, మరోవైపు 17 మంది నామినేషన్లు సమర్పించారు. 15 మేనేజింగ్ కమిటీ స్థానాలకు 33 మంది నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికల ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. తొలిసారి భారీగా నామినేషన్లు నల్గొండ రెడ్‌క్రాస్ చరిత్రలో ఇంత పెద్ద



సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడం ఇదే తొలిసారి అని నిర్వాహకులు తెలిపారు. నామినేషన్ల పరిశీలన సోమవారం, ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం నిర్వహించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవంగా ఎన్నిక జరగని పక్షంలో ఈ నెల 11న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ భవన్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి పర్యవేక్షణలో ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఎన్నికైన 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**